RNI No. TGTEL/26/A1458

# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY







SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 1 సంచిక : 4 అమీర్‌పేట్ ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ సోమవారం 13 ఏప్రియల్ 2026 పేజీలు : 4 వెల : 2/-

### తొలి జీతం
## అన్నదాతలకే..
### ఉదారత చాటుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మనస్వి



**గజ్వేల్, విశ్వం వాయిస్ న్యూస్ :** తన తొలి జీతం రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు దానం చేసి ఉదారతను చాటుకుంది ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్. వివరాల్లోకి వెళితే.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ (ఏటిగడ్డ కిష్టాపూర్)కి చెందిన ప్రభుత్వ మిగతా .. 2లో..

### ఏటీఎంలలో పెట్టాల్సిన
## రూ.1.20కోట్లతో కస్టోడియన్లు జంప్!




**అమీర్‌పేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏటీఎంలలో డబ్బులు నింపాల్సిన కస్టోడియన్లు ఏకంగా రూ.1.20 కోట్లను స్వాహా చేసి పరారయ్యారు. సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేసే 'సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్' అనే సంస్థ నిర్వహించిన అంతర్గత ఆడిటింగ్‌లో మిగతా .. 2లో..

### కేవలం పెట్టుబడులతో
## ఆర్థిక దిగ్గజం కాలేం
### న్యాయసంస్కరణలు కూడా కావాల్సిందే : సీజేఐ



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరంతర పరిణామంలమైన ఆర్థిక వ్యవస్థ న్యాయ సంస్కరణల్ని కూడా కోరుకుంటుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ శనివారం పేర్కొన్నారు. దేశం 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా పరిణతి చెందాలన్న లక్ష్యాన్ని కేవలం పెట్టుబడి, విధాన నిర్ణయాల ఆధారంగా సాధించలేమని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నాణ్యమైన న్యాయ వ్యవస్థ కూడా ఇందుకు దోహద పడుతుందని ఆయన తెలిపారు. "రూల్ ఆఫ్ లా మిగతా .. 2లో..

### అందమైన అమ్మాయిని
## అప్పగించండి
### తుర్కియేకి ఉగాండా జనరల్ హుకుం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగాండా సైన్యాధిపతి జనరల్ ముహూజీ కైనెరుగాబా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. సోమాలియాలో ఇస్లామిక్ మిలిటెంట్ల నుంచి రక్షణ కల్పించడానికి ఉగాండా అందిస్తున్న సేవలకు గానూ 1 బిలియన్ డాలర్ల నగదు చెల్లించాలని తుర్కియేను డిమాండ్ చేశారు. నగదుతో పాటు తను పెళ్లి చేసుకోవడానికి.. దేశంలోని అత్యంత అందమైన అమ్మాయిని అప్పగించాలన్నారు. 30 రోజుల్లోగా తన డిమాండ్‌కు అంగీకరించకపోతే మిగతా .. 2లో..

### బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్
# అవుతోందా?..
### ఆసక్తి రేపుతున్న కేటీఆర్ వ్యాఖ్యలు



**మంచిర్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ పార్టీ పేరును తిరిగి టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి)గా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోబోమని, ఒంటరిగానే పోటీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో జరిగిన ఓ కార్యక్రమం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ కొన్ని పొరపాట్లు చేసిందని కేటీఆర్ అంగీకరించారు. ఈ తప్పుల కారణంగా ప్రజలకు, పార్టీ నాయకులకు మధ్య కొంత దూరం పెరిగిందని, దీనిపై తాము పూర్తిస్థాయిలో అధ్యయనం చేశామని తెలిపారు. గుర్తించిన లోపాలను సరిదిద్దుకుని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. "చంద్రుడిపై కొన్ని మబ్బులు కమ్మినంత మాత్రాన చంద్రుడు కనుమరుగు కాడు. ఆ మబ్బులు తొలగి మళ్లీ ప్రకాశిస్తాడు. బీఆర్ఎస్ కూడా మిగతా .. 2లో..

### బెంగాలీలను
## మైనారిటీలు కానివ్వం
### ప్రధాని నరేంద్రమోదీ



**జంగీపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** సొంత రాష్ట్రంలో బెంగాలీలు మైనారిటీలుగా మారే పరిస్థితి రానివ్వబోమని, అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న బుజ్జగింపు రాజకీయాలకు శాశ్వతంగా తెరదించుతామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. దేశ భద్రతే తమకు ముఖ్యమని, 'ఉమ్మడి పౌరస్మృతి' (యూసీసీ)ని మిగతా .. 2లో..

## ప్రముఖ గాయని ఆశా భోంస్లే ఇకలేరు




**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) ఇకలేరు. ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమె కుమారుడు ఆనంద్ బోంస్లే ఈ విషయాన్ని ధ్రువీకరించారు. తన తల్లి అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబయిలోని శివాజీ పార్క్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ సోకడంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడగా ఆశా భోంస్లేను కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఆస్పత్రిలో చేర్చారు. మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కారణంగా మరణించినట్లు ఆమెకు చికిత్స అందించిన వైద్యుల్లో మిగతా .. 2లో..

### మహిళల ఆశలు, ఆకాంక్షలకు
## మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక
### కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతివ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలు బుద్ధి చెబుతారన్నారు. మహిళలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు దశాబ్దాల నాటి కల అని, మిగతా .. 2లో..

### ఇంటర్ ఫలితాల్లో
## బాలికలదే పైచేయి..



**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఈ ఫలితాలను విడుదల చేశారు. ప్రథమ ఇంటర్‌లో 66.2 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 70.58 శాతం మిగతా .. 2లో..


### నా ప్రమేయం
## నిరూపిస్తే దేనికైనా సిద్ధం..
### ఆరోపణలపై మంగ్లీ తీవ్ర భావోద్వేగం



**పంజాగుట్ట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ జానపద గాయని మంగ్లీ, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారంటూ న్యాయవాది సింగపోగు సుబ్బారావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేవలం బిగ్ బాస్ షోలో అవకాశం కోసమే సుబ్బారావు తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రచారం పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. ఈ వ్యవహారంపై మీడియాతో మాట్లాడుతూ ఆమె తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇందులో తన ప్రమేయం నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. నోట్లకట్టలతో కనిపించింది తన తమ్ముడు కాదని స్పష్టం చేశారు. సుబ్బారావు ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంగ్లీ, "నాపై చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవాలు. గతంలో నా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వీడియోలను తొలగించాలంటే రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. నేను డబ్బు ఇవ్వకపోవడంతోనే నాపై కక్షగట్టి ఇలాంటి నీచమైన ప్రచారానికి దిగారు" అని మంగ్లీ ఆరోపించారు.

**వివాదం నేపథ్యం ఇదే**

కొద్ది రోజుల క్రితం న్యాయవాది సుబ్బారావు, సింగర్ మంగ్లీ మిగతా .. 2లో..



### ప్రకాశం జిల్లాలో
## దారుణం...
### 13 ఏళ్ల కూతురిపై తండ్రి అఘాయిత్యం

**తాళ్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే.. కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తాళ్లూరు మండలంలోని ఓ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ తండ్రికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెపై తండ్రి తరుచూ అఘాయిత్యానికి పాల్పడుతూ ఉన్నాడు. ఇది గమనించిన మిగతా .. 2లో..

### 18న జులై శ్రీవారి
## ఆర్జిత సేవా టికెట్ల విడుదల



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** భక్తుల సౌకర్యార్థం 2026 జులై నెలకు సంబం ధించిన శ్రీవారి ఆర్జిత సేవల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) టికెట్లకు ఎలక్ట్రానిక్ డిప్‌లో పేర్ల నమోదు ఏప్రిల్ 18న ఉదయం 10 గంటలకు తితిదే వెబ్‌సైట్‌లో ప్రారంభం కానుంది. ఈ టికెట్లకు ఈ నెల 20 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో మిగతా .. 2లో..

### మా నమ్మకాన్ని పొందలేకపోయింది..
## అమెరికా వల్లే చర్చలు విఫలం : ఇరాన్



**టెహ్రాన్, విశ్వం వాయిస్ న్యూస్ :** యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికాతో చర్చలు విఫలం కావడానికి ఆ దేశమే కారణమని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్ ఆరోపించారు. 21 గంటల పాటు జరిగిన చర్చల సందర్భంగా తమ ప్రతినిధి బృందం సానుకూల ప్రతిపాదనలు అందించిందని చెప్పారు. అయినప్పటికీ.. అమెరికన్లు తమ నమ్మకాన్ని పొందలేకపోయారని 'ఎక్స్' వేదికగా తెలిపారు. అగ్ర రాజ్యంతో చర్చలకు ఇరాన్ తరఫున మిగతా .. 2లో..

### అమెరికాలో
## బొబ్బిలి టెకీ మృతి




**బొబ్బిలి, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామానికి చెందిన సింగిరెడ్డి సాయి శ్రీహరికృష్ణ అమెరికాలో శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ సమాచారాన్ని అతడి సన్నిహితులు కుటుంబ సభ్యులకు చేరవేశారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన హరికృష్ణ ఎమ్మెస్ కోసం అమెరికా వెళ్లాడు. చదువు పూర్తి కాగానే మూడు నెలల కిందట అక్కడే ఉద్యోగం కూడా సంపాదించాడు. కుమారుడు ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు రమ, శ్రీనివాస్ ఎంతో ఆనందపడ్డారు. శనివారం తన పుట్టినరోజు సందర్భంగా స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపాడు. సాయంత్రం చెరువులో స్నానానికి దిగి మునిగి చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్న వయసులోనే మిగతా .. 2లో..

### జులై 3 నుంచి
## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం



**విశ్వం వాయిస్ న్యూస్ :** దక్షిణ కశ్మీర్‌లో 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న అమరనాథుడిని దర్శించుకునేందుకు ఏటా వైభవంగా నిర్వహించే అమర్‌నాథ్ యాత్ర తేదీలు ఖరారయ్యాయి. జులై 3 నుంచి ఇది ప్రారంభం కానుందని జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మిగతా .. 2లో..

## హర్మూజ్‌ను దిగ్బంధించండి..
### ట్రంప్ ఆదేశాలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో చర్చలు విఫలమైన వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్‌ను తెరుస్తామని ఇరాన్ వాగ్దానం చేసిందని, కానీ మాట తప్పిందన్నారు. ఇరాన్ చర్యలతో అనేక దేశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, జలసంధిని వెంటనే మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్ అవుతోందా?..

తాత్కాలికంగా వెనుకబడ్డా తిరిగి పుంజుకుని అధికారంలోకి వస్తుంది. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందని, మేధావులు మౌనంగా ఉంటున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రలో ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు, కేసీఆర్ గొప్ప ముఖ్యమంత్రులుగా నిలిచారని ప్రస్తావించారు. ప్రస్తుతం కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీ పేరు మార్పు ఆలోచన, భవిష్యత్ వ్యూహాలపై విశ్లేషణలు మొదలయ్యాయి.

**ఆ నలుగురూ గొప్ప సీఎంలు**

"చంద్రుడిపై కొన్ని మబ్బులు కమ్ముకున్నాయి. మబ్బులు తొలిగి చంద్రుడు మళ్లీ ఉజ్వలంగా ప్రకాశిస్తాడు. డీలిమిటేషన్‌తో తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయి. ఇతర రాష్ట్రాల పార్టీలు వస్తానంటే కాదనలేం. గతంలో మేం కూడా మహారాష్ట్రకు వెళ్లాం కదా. రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యత విపరీతంగా పెరిగింది. మేధావులు అనుకున్నవాళ్లు ఇప్పుడు మాట్లాడటం లేదు. నలుగురు సీఎంలు చరిత్రలో నిలిచిపోయేలా పాలించారు. వారే ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్" అని కేటీఆర్ అన్నారు.

# రూ.1.20కోట్లతో కస్టోడియన్లు జంప్!

ఈ భారీ మోసం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. సీఎంఎస్ సంస్థ వివిధ బ్యాంకుల ఏటీఎంలలో నగదు నింపే కాంట్రాక్టును నిర్వహిస్తోంది. ఇటీవల ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 31 ఏటీఎంలలో సంస్థ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 8 ఏటీఎంలలో నగదు తక్కువగా ఉండటంతో అధికారులు కంగుతిన్నారు. మొత్తం రూ. 1,20,98,500 తేడా ఉన్నట్టు గుర్తించారు. ఈ 8 ఏటీఎంల బాధ్యతలు చూస్తున్న ఇద్దరు కస్టోడియన్లపైనే సంస్థ యాజమాన్యం అనుమానం వ్యక్తం చేస్తోంది. గత కొన్ని రోజులుగా వారు విధులకు హాజరుకాకపోవడం, వారి ఫోన్లు స్విచ్చాఫ్ చేసి ఉండటంతో వారే ఈ సొమ్మును కాజేసి ఉంటారని భావిస్తున్నారు. నిందితులు ఒకేసారి కాకుండా, విడతల వారీగా నగదును పక్కదారి పట్టించి ఉంటారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. సంస్థ బ్రాంచ్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఏటీఎం కేంద్రాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# తొలి జీతం అన్నదాతలకే...

ఉపాధ్యాయుడు పులి రాజు కుమార్తె పులి మనస్వి ఇటీవల ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం సాధించారు. ఈ నెల 10న మనస్వి తన మొదటి నెల వేతనాన్ని అందుకున్నారు. ఆ డబ్బును తన సొంత అవసరాలకు వాడుకోకుండా రైతు కుటుంబాలకు వెచ్చించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఐదుగురు బాధిత రైతు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 వేల నగదుతో పాటు చీరలను అందజేశారు. చిన్న వయసులోనే సామాజిక బాధ్యతను చాటుకుని, ఆపదలో ఉన్న రైతు కుటుంబాలకు అండగా నిలిచిన మనస్విని పలువురు ప్రముఖులు, గ్రామస్థులు అభినందించారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక

మహిళా రిజర్వేషన్ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మకమని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా బిల్లుకు మద్దతివ్వాలని బండి పిలుపునిచ్చారు. "మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక. పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిందే. డీలిమిటేషన్‌తో పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. తెలంగాణ అసెంబ్లీలో 60 మంది మహిళలకు అవకాశాలు లభిస్తాయి" అని బండి సంజయ్ అన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకూ జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే 'నారీశక్తి వందన్ అధినియం'బిల్లును ప్రవేశపెట్టనున్నారు. చట్టాన్ని 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే అమలులోకి తెచ్చేలా చర్యలు చేపట్టనున్నారు.

# నా ప్రమేయం నిరూపిస్తే దేనికైనా సిద్ధం..

మైక్రో ఫైనాన్స్ పేరుతో అమాయక ప్రజల నుంచి సుమారు రూ.10 కోట్లు వసూలు చేసి మోసం చేశారని ఆరోపిస్తూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా, ఈ విషయంపై మంగ్లీ, ఆమె సోదరులు తనను ఫోన్‌లో బెదిరించారని కూడా ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**మంగ్లీ ఆవేదన**

మీడియా సమావేశంలో మాట్లాడిన మంగ్లీ, తనపై వస్తున్న ఆరోపణల కారణంగా తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. "ఎక్కడ చూసినా మంగ్లీ, మంగ్లీ అంటూ ఈ నెగెటివిటీని ఎందుకు ఇంత సెన్సేషనల్ చేస్తున్నారు? నా మంచి పనులను ఎవరూ గుర్తించరు. ఇదే పరిస్థితి మీ ఇంట్లో అక్కాచెల్లెళ్లకు ఎదురైతే మీరు తట్టుకోగలరా? చాలా మంది నాతో ఫోటోలు దిగుతారు. ఎవరో చేసిన తప్పులకు నన్ను బాధ్యురాలిని చేయడం ఎంతవరకు సమంజసం? మీడియా కుటుంబం నుంచే వచ్చిన నన్ను ఇలా వేధించడం సరికాదు" అని ప్రశ్నిస్తూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. న్యాయవాది సుబ్బు కేవలం పాపులారిటీ కోసమే తన పేరును ఈ వివాదంలోకి లాగుతున్నారని మంగ్లీ ఆరోపించారు. "ఆయనకు ఫేమస్ అవ్వాలనే కోరిక ఉంది. వచ్చే ఏడాది బిగ్ బాస్‌కు వెళతానని, యాంకర్ శ్రీముఖి అంటే క్రష్ అని ఆయనే చెబుతున్నారు. అలాంటి వ్యక్తి ప్రచారం కోసం నాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. నాతో మాట్లాడినప్పుడు కూడా ఆయన ప్రవర్తన సరిగా లేదు. దానికి సంబంధించిన వీడియో నా దగ్గర ఉంది" అని చెబుతూ దాన్ని మీడియాకు చూపించారు. ఆయన తనతో వల్గర్‌గా మాట్లాడారని, ఆకాశం నుంచి ఊడిపడ్డావా అంటూ అసభ్య పదజాలం వాడారని మండిపడ్డారు. ఈ కేసులో తన ప్రమేయం ఉందని నిరూపిస్తే ఎక్కడికి రమ్మన్నా రావడానికి సిద్ధమని మంగ్లీ సవాల్ విసిరారు. "నా ప్రమేయం లేదని తేలితే, ఆరోపణలు చేసిన సుబ్బును మీరేం చేస్తారో నాకు మాట ఇవ్వాలి" అని మీడియాను నిలదీశారు. తాను వృత్తిపరంగా ఎంతో బిజీగా ఉన్నానని, ఇటీవలే కర్ణాటకలోని శ్రీదత్త యూనివర్సిటీలో ప్రదర్శన ఇచ్చి వచ్చానని, తన ఇన్‌స్టాగ్రామ్ అప్‌డేట్స్ చూస్తే తన పని ఏంటో తెలుస్తుందని అన్నారు. అనవసర వివాదాలతో తన సమయాన్ని వృథా చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో, ఈ కేసులోని అసలైన బాధితులకు తాను అండగా ఉంటానని మంగ్లీ స్పష్టం చేశారు. "బాధితులకు పోలీస్ శాఖ తప్పకుండా న్యాయం చేయాలి. నేను కచ్చితంగా వారి పక్షాన నిలబడతాను. కానీ, సంబంధం లేకుండా నా పేరును లాగడం మాత్రం అన్యాయం" అని అన్నారు. ఇకపై ఈ విషయంపై తాము న్యాయపరంగానే ముందుకు వెళతామని, తన న్యాయవాది మిగిలిన విషయాలు చూసుకుంటారని ఆమె తేల్చిచెప్పారు.

**ఇంటర్ ఫలితాల్లో**

# బాలికలదే పైచేయి..

ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. ఈ ఫలితాల్లో ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు.

ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 4,89,123 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,23,807 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో ఉత్తీర్ణత శాతం 74.4 కాగా.. బాలురు ఉత్తీర్ణత శాతం 57.69గా ఉంది.

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు మొత్తంగా 5,07,948 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,58,490 మంది (70.34శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 78.65గా ఉండగా.. బాలుర ఉత్తీర్ణత 62.50 శాతంగా నమోదైంది.

ప్రథమ ఇంటర్‌లో 66.20 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 66.94% మంది, ఒకేషనల్‌లో 59.30% మంది ఉత్తీర్ణత సాధించారు.

ద్వితీయ ఇంటర్‌లో 75.34శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 75.61%, ఒకేషనల్‌లో 72.71%గా ఉంది.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం బాగానే ఉంది. బీసీ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 86శాతం (జనరల్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 96శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో (జనరల్) 90శాతం నమోదు కాగా.. ఒకేషనల్‌లో 98శాతంగా ఉంది.

కేజీబీవీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 72శాతం, ఒకేషనల్‌లో 86శాతం ఉత్తీర్ణత కాగా.. సెకండ్ ఇయర్‌లో 82శాతం, ఒకేషనల్‌లో 94శాతంగా ఉంది.

ప్రైవేటు అన్ ఎయిడెడ్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో (జనరల్) 77శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 65శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో 71శాతం (రెగ్యులర్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 51శాతంగా ఉంది.

సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తీర్ణత శాతం 77.66 కాగా.. ద్వితీయ ఇంటర్‌లో 86.79శాతంగా ఉంది.

# కేవలం పెట్టుబడులతో ఆర్థిక దిగ్గజం కాలేం

కన్వెన్షన్ 2026"లో భాగంగా "పది ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించడానికి కావాల్సిన న్యాయపరమైన సంస్కరణలు" అనే అంశంపై సీజేఐ మాట్లాడారు.

# అందమైన అమ్మాయిని అప్పగించండి

తీవ్రమైన దౌత్య పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తుర్కియేను హెచ్చరించారు. ఉగాండాలోని ఆ దేశ రాయబార కార్యాలయాన్ని సైతం మూసివేస్తామని.. తమ గగనతలంలో తుర్కియే ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు నిలిపివేస్తామని అన్నారు. తుర్కియేతో ఉగాండాకు ఉన్న సంబంధాలన్నీ త్వరలో తెంచుకుంటామని కైనెరుగాబా అన్నారు. వెన్నుపోటు పొడిచే స్నేహితుడిని తాము కోరుకోవట్లేదంటూ వ్యాఖ్యానించారు. తుర్కియేకు అన్ని ప్రయాణాలు నిలిపేసుకోవాలని దేశ ప్రజలకు సూచించారు. అదే సమయంలో ఇజ్రాయెల్‌కు సాయంగా లక్ష మంది సైనికులను పంపనున్నట్లు తెలిపారు. కైనెరుగాబా స్త్రీలను ఉద్దేశించి ఇలాంటి విపరీతమైన డిమాండ్లు చేయడం ఇదే మొదటిసారి కాదు. 2022లో ఇదే విధంగా ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనిని వివాహం చేసుకుంటానని బహిరంగంగా ప్రకటించారు. ఆమెను తనకు అప్పగిస్తే.. బదులుగా 100 అంకోలే జాతి ఆవులను ఇస్తానని ఆఫర్ చేశారు. అనంతరం కైనెరుగాబా వ్యాఖ్యలకు గానూ అతడి తండ్రి, ఉగాండా అధ్యక్షుడు అయిన యోవేరి ముసెవెని బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ప్రస్తుతం కైనెరుగాబా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. ఆయన వ్యాఖ్యలపై ఇప్పటి వరకు తుర్కియే స్పందించలేదు.

# మైనారిటీలు కానివ్వం

అమలు చేస్తామని చెప్పారు. అక్రమ చొరబాటుదారులంతా మూటాముల్లె సర్దుకుని వెళ్లిపోవాల్సిందేనని స్పష్టంచేశారు. పశ్చిమబెంగాల్‌లోని ముర్శిదాబాద్ జిల్లా జంగీపుర్, తూర్పు బుర్ద్వాన్ జిల్లా కట్వాలలో శనివారం ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. "ఈ ఎన్నికలు బెంగాల్ గుర్తింపును, భవితను కాపాడే పోరాటం. మీ ప్రతిఒక్క ఓటు మాకు ఆశీర్వాదం. ప్రభుత్వాన్ని మార్చడానికే కాకుండా బెంగాల్ అస్తిత్వాన్ని కాపాడేందుకు ఓటు ఉపయోగపడుతుంది"అని మోదీ చెప్పారు.

**బ్యాండేజీలతో ఓట్లు పడవు: షా**

**కోల్‌కతా :** పదిహేనేళ్ల పాలనలో ముఖ్యమంత్రి మమతాబెనర్జీ పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని విధ్వంసంవైపు నడిపించారని, ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి సానుభూతితో ఓట్లు పొందాలని చూస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఒకసారి కాలికి, మరోసారి తలకు బ్యాండేజీ కట్టుకుని సానుభూతి కోసం వెంపర్లాడారని, ఈసారి అలాంటివి ఎన్నిచేసినా ఓటర్లు మాత్రం ఆమెకు ఓటు వేయరని స్పష్టంచేశారు.

**తప్పుడు కేసులు పెట్టాలని చూశారు: మమత**

దక్షిణ కోల్‌కతాలోని భవానీపుర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని రద్దు చేయించడానికి భాజపా ప్రయత్నించిందని మమత ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో తప్పుడు కేసులు పెట్టాలని చూసిందని, ఆ ప్రయత్నాలను తమ పార్టీ నేతలు, ప్రజలు తిప్పికొట్టారని వెల్లడించారు.

# ప్రముఖ గాయని ఆశా భోంస్లే ఇకలేరు

ఒకరైన డాక్టర్ ప్రదీప్ సందానీ మీడియాకు తెలిపారు. ఆశా భోంస్లే మృతి పట్ల సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సోషల్ మీడియాలో సంతాపం ప్రకటిస్తున్నారు. 1933లో మహారాష్ట్రలోని సాంగ్లీలో ఆశా భోంస్లే జన్మించారు. గాయనిగా సుదీర్ఘ ప్రయాణం ఆమెది. ఎన్నో వేల పాటలతో శ్రోతలను అలరించారు. చిత్ర పరిశ్రమకు చేసిన ఎనలేని కృషికిగానూ పద్మ విభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, మహారాష్ట్ర భూషణ్, బంగా బిభూషన్ అవార్డులు ఆమెను వరించాయి. ఆశా సినీ ప్రస్థానం 1943లో మరాఠీ చిత్రం 'మజాబ్'తో ప్రారంభమైంది. అందులో 'చలా చలా నవ్ చలా' పాట పాడారు. 1948లో బాలీవుడ్ దర్శకుడు హంసరాజ్ బహల్ పిలుపుతో ముంబయి వెళ్లారు. 1954లో వచ్చిన 'బూట్ పాలిష్'లోని పాటలతో ఆశాకు మంచి గుర్తింపు దక్కింది. 'దమ్ మారో దమ్', 'చురా లియా హై తుమ్నే జో దిల్ కో' తదితర పాటలు సంచలనం సృష్టించాయి.తెలుగు సినిమాల్లో ఆశా భోంస్లే పాడింది తక్కువ పాటలే అయినా దేనికదే ప్రత్యేకం. 80ల నుంచి 2007 వరకూ తెలుగులో పాడారు. 'ఇది మౌనగీతం' (పాలు నీళ్లు), 'సీతాకాలం ప్రేమకు' (అశ్వమేథం), 'ఐసాలకిడీ' (పవిత్ర బంధం), నాలో ఊహలకు (చందమామ) తదితర పాటలతో ఆమె అలరించారు. తన సోదరి, ప్రముఖ గాయని లతా మంగేష్కర్ వ్యక్తిగత కార్యదర్శి గణపతిరావును పెళ్లి చేసుకున్నారు. కొన్నాళ్లకు విడాకులు తీసుకున్నారు. 1980లో ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్డీ బర్మన్‌ను వివాహమాడారు. 1994లో ఆయన మరణించడంతో.. అప్పటి నుంచి తన ముగ్గురు పిల్లలు, మనవడు, మనవరాలే లోకంగా జీవితం గడిపారు.

# ప్రకాశం జిల్లాలో దారుణం...

తల్లి భర్తతో గొడవపడి ఇద్దరు కుమార్తెలను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది. రెండ్రోజుల క్రితం బాలికకు కడుపునొప్పి రావడంతో బంధువులు ఒంగోలు రిమ్స్‌లో చేర్పించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు తాళ్లూరు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

**18న జులై శ్రీవారి**

# ఆర్జిత సేవా టికెట్ల విడుదల

నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం డిప్‌లో ఎంపిక చేస్తారు. డిప్‌లో ఈ-టికెట్లు పొందిన వారు ఏప్రిల్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. 23న ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24 ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. భక్తులు హ్టీజూం:ÑÑ/ఎవఋుర్ష్టుఋుఎం.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

# అమెరికా వల్లే చర్చలు విఫలం : ఇరాన్

ఘాలిబఫ్‌తోపాటు విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ నాయకత్వం వహించిన విషయం తెలిసిందే. "యుద్ధం ముగింపు విషయంలో మాకు సదుద్దేశం, సంకల్పం ఉన్నాయని చర్చలకు ముందే చెప్పాం. కానీ.. గత రెండు యుద్ధాల అనుభవం కారణంగా మాకు అవతలి పక్షంపై నమ్మకం లేకుండా పోయింది. చర్చల సమయంలో మా ప్రతినిధులు దూరదృష్టితో కూడిన కొన్ని ప్రతిపాదనలు చేశారు. కానీ.. మా నమ్మకాన్ని చూరగొనడంలో అమెరికా విఫలమైంది. ఇరాన్ ఆలోచన విధానాన్ని, సూత్రాలను బాగా అర్థం చేసుకుంది. ఇప్పుడు మా విశ్వాసాన్ని గెలుచుకోగలదా? లేదా? అనేది ఆ దేశం చేతుల్లో ఉంది. ఇరాన్ అంటే 9 కోట్లమంది ప్రజల సముదాయం. సుప్రీం లీడర్ పిలుపును అనుసరించి.. వారంతా వీధుల్లోకి వచ్చారు. మా ప్రజల హక్కుల సాధనకు సైనిక పోరాటంతోపాటు దౌత్యం కూడా ఓ మార్గమని భావిస్తున్నాం. అదేవిధంగా 40 రోజుల యుద్ధంలో సాధించిన విజయాలను సుస్థిరం చేసుకునే దిశగా మా ప్రయత్నాలను విరమించుకోం" అని ఘాలిబఫ్ అన్నారు. పాకిస్థాన్ వేదికగా ఇరాన్- అమెరికాల మధ్య నిర్వహించిన శాంతి చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. ఇరాన్ తమ షరతులు అంగీకరించని కారణంగా ఎలాంటి ఒప్పందం కుదరలేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. అయితే, అమెరికా అర్థం లేని డిమాండ్లు చేసిందని ఇరాన్ ఆరోపించింది.

# అమెరికాలో బొబ్బిలి టేకీ మృతి

సాయి శ్రీ హరికృష్ణ అకాల మరణం కలచివేసిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించినట్లు వెల్లడించారు.

# అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

ఆదివారం ప్రకటించారు. 57 రోజుల పాటు కొనసాగే ఈ యాత్ర.. ఆగస్టు 28న ముగుస్తుందన్నారు. యాత్ర చేపట్టాలనుకునే భక్తులు ఏప్రిల్ 15 నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. జమ్ముకశ్మీర్ బ్యాంకు, ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యెస్ బ్యాంకులకు చెందిన 554 శాఖల్లో అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. బోర్డు నిబంధనల ప్రకారం.. పదమూడేళ్లలోపు వయసున్న పిల్లలను, 70 ఏళ్లకు పైబడిన వృద్ధులను ఈ యాత్రకు అనుమతించరు.

# హర్మూజ్‌ను దిగ్బంధించండి..

తెరవాలన్నారు. ఇదే సమయంలో హర్మూజ్‌ను దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు చెప్పారు. జలసంధిలోకి నౌకలు ప్రవేశించకుండా లేదా నిష్క్రమించకుండా అమెరికా నౌకలు త్వరలో ఆపరేషన్ మొదలుపెడతాయన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో సుదీర్ఘ పోస్టు చేశారు. అంతర్జాతీయ జలాల్లో ఇరాన్‌కు సుంకం చెల్లించిన ప్రతి నౌకను వెంబడించి అడ్డుకోవాలని తమ నౌకాదళానికి ఆదేశాలు ఇచ్చినట్లు ట్రంప్ వెల్లడించారు. చట్టవిరుద్ధమైన ఈ టోల్ చెల్లించే ఎవరికీ అంతర్జాతీయ సముద్రాలపై సురక్షితమైన ప్రయాణం ఉండబోదన్నారు. సరైన సమయంలో ఇరాన్‌ను అంతం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందన్నారు. జలసంధిలో ఇరాన్ అమర్చిన మందుపాతరలను ధ్వంసం చేస్తామన్నారు. తమపై, శాంతియుతంగా వెళ్లే నౌకలపై దాడులు చేస్తే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందన్నారు.

**అందుకే చర్చలు బెడిసికొట్టాయి**

ఇరాన్ చర్చల్లో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ.. అణుశక్తి విషయంలో అంగీకారం కుదరలేదని ట్రంప్ పేర్కొన్నారు. అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేకపోవడం వల్లే చర్చలు బెడిసికొట్టాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కనివ్వనని తేల్చిచెప్పారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన నాశనమైందని.. గగనతల రక్షణ, రాడార్ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు. ఖమేనీ సహా అనేక మంది ఇరాన్ నేతలు మరణించారని.. ఇదంతా వారి అణ్వాయుధాల ఆశయం వల్లేనని అన్నారు. హర్మూజ్ దిగ్బంధనం త్వరలో ప్రారంభమవుతుందని, ఇందులో ఇతర దేశాలు కూడా భాగస్వామ్యమవుతాయన్నారు. చట్టవిరుద్ధంగా ఇరాన్ ప్రయోజనం పొందడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమన్నారు.

# ఎడిటర్ వాయిస్

## మెయిన్ పార్టీనీ వీడి.. సైడ్ పార్టీని పట్టుకున్న కవిత వ్యూహం ఏంటి..?

రాజకీయం అంటేనే ఎత్తుగడలు.. మరీ ముఖ్యంగా సొంత గూడు వదిలి బయటకు వచ్చిన నేతలు వేసే అడుగులు చదరంగంలో ఎత్తుల కంటే వేగంగా మారుతుంటాయి. ఈ నెలలోనే ఎజెండాను ప్రకటిస్తానని చెబుతున్న మాజీ ఎంపీ కవిత ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. సహజంగా కొత్త పార్టీ పెడితే అధికార పక్షాన్ని టార్గెట్ చేయడం ఆనవాయితీ.. కానీ, కవిత మాత్రం దీనికి భిన్నంగా వెళ్తున్నారు. అధికార కాంగ్రెస్‌ను కాదని, బలహీనపడ్డ 'కారు' (బీఆర్ఎస్) వెంటే ఆమె ఎందుకు పడుతున్నారు..? ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లెక్కలేంటో చూద్దాం.

**కవిత కాంగ్రెస్ జోలికి ఎందుకు వెళ్లడం లేదు?**

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ఐకాన్ లీడర్‌గా ఎదిగారు. ఆయన ఇమేజ్ మరోసారి పార్టీని అధికారంలోకి తెస్తుందన్న విశ్వాసం ప్రజల్లో ఉంది. ఇలాంటి సమయంలో బలంగా ఉన్న రేవంత్ రెడ్డిని కదిపితే అనవసరమైన ఇబ్బందులు తప్ప ప్రయోజనం ఉండదని కవిత భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రేవంత్ రెడ్డి జోలికి వెళ్లకుండా, తన రాజకీయ భవిష్యత్తు కోసం మరో మార్గాన్ని ఎంచుకున్నారు. అదే కారు పార్టీని కంగారు పెట్టడం.

**బీఆర్ఎస్ బలహీనతలే బలం!**

కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నో ప్రాజెక్టులు, పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ.. కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలు ఆ పార్టీని దెబ్బతీశాయి. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూట గట్టుకుంది. ఇప్పుడు బీఆర్ఎస్‌లో నాయకత్వ లేమి, అంతర్గత కలహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం కావడం, కేటీఆర్-హరీష్ రావు మధ్య విభేదాల వాదనలు వినిపిస్తుండడంతో ఆ పార్టీ క్యాడర్ అయోమయంలో ఉంది. ఈ అనిశ్చిత వాతావరణమే తనకు అనుకూలమని కవిత అంచనా వేస్తున్నారు.

**టార్గెట్ 'గులాబీ' ఓటు బ్యాంకు**

బీఆర్ఎస్ పార్టీకి క్షేత్ర స్థాయిలో ఇప్పటికీ బలమైన కేడర్ ఉంది. ఆ కేడర్ ఇప్పుడు నిరుత్సాహంలో ఉండడంతో, వారిని తన వైపు తిప్పుకోవాలన్నది కవిత పక్కా ప్లాన్. బీజేపీకి నాయకులు ఉన్నా క్షేత్ర స్థాయి ఓటు బ్యాంకు తక్కువగా ఉండడంతో, ఆమె దృష్టి అంతా బీఆర్ఎస్ కేడర్‌పైనే ఉంది. 'కారు'లోని అసంతృప్త నేతలను, నాయకత్వం కోసం వెతుకుతున్న కార్యకర్తలను చేరదీయడం ద్వారా తన కొత్త పార్టీని బలోపేతం చేసుకోవాలని వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు.


రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్నది జగమెరిగిన సత్యం. నిన్నటి వరకు అదే పార్టీలో ఉండి, ఇప్పుడు అదే పార్టీ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలని చూడడం రాజకీయ చదరంగంలో ఒక భాగమే. కవిత వేస్తున్న ఈ 'రివర్స్ వ్యూహం' ఎంత వరకు ఫలమిస్తుంది..? కేసీఆర్ నిర్మించిన కోటలో ఆమె చీలిక తీసుకురాగలదా? అన్నది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ నెల 25న కవిత ప్రకటించబోయే జెండా, అజెండాలో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించి ఎలాంటి అంశాలు ఉంటాయన్నది కీలకం. కాంగ్రెస్‌ను కాదని బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయడం ద్వారా ఆమె తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని మార్చాలని చూస్తున్నారు. ఒకవేళ బీఆర్ఎస్ కేడర్ ఆమె వైపు మొగ్గు చూపితే, రాష్ట్రంలో విపక్ష హోదా కోసం సరికొత్త పోరాటం మొదలవుతుంది. ఏదేమైనా కవిత వేస్తున్న ఈ ఎత్తుగడలు గులాబీ శ్రేణుల్లో మాత్రం గుబులు పుట్టిస్తున్నాయి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# ఏప్రిల్ 22 వరకు భగభగే..

## తెలంగాణకు వాతావరణ శాఖ హెచ్చరిక




**తెలంగాణా, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతోందని, రానున్న పది రోజుల పాటు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఏప్రిల్ 22వ తేదీ వరకు పలు జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు చేరవచ్చని అంచనా వేసింది. గత వారం రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా నమోదవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రతకు తోడు వేడి, ఉక్కపోత అధికంగా ఉండ టంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం నాటికే రాష్ట్రంలోని 27 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నల్గొండ జిల్లా ఘనపూర్‌లో అత్యధికంగా 41.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆకాశంలో మేఘాలు కనిపించినా వాతావరణంలో చల్లదనం ఉండదని, వేడిగాలులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. రాజధాని హైదరాబాద్‌లోనూ రానున్న రోజుల్లో 40 నుంచి 41 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీలక సూచనలు చేసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని హితవు పలికింది. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారుల విషయంలో మరింత జాగ్రత్త అవసరమని సూచించింది. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే వడదెబ్బ తగలకుండా తలపాగా, గొడుగు వంటివి వాడాలని, తరచూ నీరు, ద్రవ పదార్థాలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

### తెలంగాణలో 'దోచుకో.. దాచుకో'

## ప్రభుత్వం నడుస్తోంది : కేటీఆర్



**మంచిర్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో 'దోచుకో.. దాచుకో' ప్రభుత్వం నడుస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలంతా అదే పని మీద ఉన్నారని విమర్శించారు. మంచిర్యాల జిల్లాలో పర్యటించిన ఆయన.. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన క్యాతనపల్లి పాలకవర్గ సభ్యులను సన్మానించారు. ఎన్ని ప్రలోభాలకు గురి చేసినప్పటికీ.. బీఆర్ఎస్-సీపీఐ కూటమి తరఫున గెలిచి కౌన్సిలర్లు.. ప్రజాస్వామ్యాన్ని గెలిపించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అటకెక్కించిందని ధ్వజమెత్తారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరిట.. సింగరేణి సంపదను దోచుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు.

## బేగంపేట యాక్సిస్ బ్యాంక్‌లో భారీ మోసం




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** బేగంపేట యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్‌లో భారీ మోసం జరిగినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తాజాగా బ్యాంక్ మేనేజర్ వెంకటరమణను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వినియోగదారుడి ఖాతా నుంచి రూ.6.5కోట్లు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను విదేశాల్లో ఉన్న సమయంలో ఇదంతా జరిగినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతకం ఫోర్జరీ చేసి 42 లూజ్ లీఫ్ చెక్కులు వినియోగించారని అందులో పేర్కొన్నారు.ఈ కేసులో బ్రాంచ్ సీనియర్ అధికారులు, ఆపరేషన్స్ టీమ్ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించినట్లు తెలుస్తోంది. అనుమతి లేకుండానే బ్యాంక్ ఖాతా క్లోజ్ చేశారని, సీఈవో దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతోపాటు అనేక మంది బ్యాంక్ ఖాతాల నుంచి కూడా నగదు మాయమవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. బ్రాంచ్ మేనేజర్ వెంకటరమణను కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

### తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ

## పరీక్షల షెడ్యూల్ విడుదల



**తెలంగాణా, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ముఖ్య గమనిక. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు, 2026 మే/జూన్ కు సంబంధించిన టైమ్‌టేబుల్‌ను తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సులకు చెందిన ఫస్టియర్, సెకండియర్ విద్యార్థుల కోసం ఈ షెడ్యూల్‌ను ప్రకటించింది. థియరీ పరీక్షలు మే 13వ తేదీ నుంచి ప్రారంభమై మే 21వ తేదీన ముగుస్తాయి. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలను మే 22 నుంచి 25 వరకు రెండు సెషన్లలో (ఉదయం 9-12, మధ్యాహ్నం 2-5) నిర్వహిస్తారు. మే 26న ఇంగ్లీష్ ప్రాక్టికల్, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షలు, మే 28న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జరగనుంది.

**థియరీ పరీక్షల పూర్తి షెడ్యూల్:**

మే 13 (బుధవారం): సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 (ఫస్టియర్); సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 (సెకండియర్)

మే 14 (గురువారం): ఇంగ్లీష్ పేపర్-1 (ఫస్టియర్); ఇంగ్లీష్ పేపర్-2 (సెకండియర్)

మే 15 (శుక్రవారం): మ్యాథ్స్-1ఏ, బోటనీ-1, పొలిటికల్ సైన్స్-1 (ఫస్టియర్); మ్యాథ్స్-2ఏ, బోటనీ-2, పొలిటికల్ సైన్స్-2 (సెకండియర్)

మే 16 (శనివారం): మ్యాథ్స్-1బీ, జువాలజీ-1, హిస్టరీ-1 (ఫస్టియర్); మ్యాథ్స్-2బీ, జువాలజీ-2, హిస్టరీ-2 (సెకండియర్)

మే 18 (సోమవారం): ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 (ఫస్టియర్); ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2 (సెకండియర్)

మే 19 (మంగళవారం): కెమిస్ట్రీ-1, కామర్స్-1 (ఫస్టియర్); కెమిస్ట్రీ-2, కామర్స్-2 (సెకండియర్)

మే 20 (బుధవారం): పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్-1 (ఫస్టియర్); పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్-2 (సెకండియర్)

మే 21 (గురువారం): మోడరన్ లాంగ్వేజ్-1, జాగ్రఫీ-1 (ఫస్టియర్); మోడరన్ లాంగ్వేజ్-2, జాగ్రఫీ-2 (సెకండియర్)

ఈ తేదీలు ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు కూడా వర్తిస్తాయని, అయితే వారికి సంబంధించిన పూర్తి టైమ్‌టేబుల్‌ను ప్రత్యేకంగా విడుదల చేస్తామని బోర్డు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# అంత పవర్‌ఫుల్ డేనా..? వైశాఖ అమావాస్య నాడు మర్చిపోయి కూడా ఈ పనులు చేయొద్దంట..




వైశాఖ అమావాస్య హిందూ సంప్రదాయంలో విశేష ప్రాముఖ్యతను కలిగిన ఒక పవిత్రమైన రోజు. ప్రతి నెల వచ్చే అమావాస్యల కంటే వైశాఖ మాసంలో వచ్చే అమావాస్యను మరింత శక్తివంతమైనదిగా భావిస్తారు. ఇది విశ్వాసం, స్మరణ, పితృదేవతలకు నైవేద్యాలు సమర్పించేందుకు ఒక ముఖ్యమైన సందర్భం. ప్రతి నెలా అమావాస్య వస్తుంది. అయితే, హిందూ క్యాలెండర్ ప్రకారం.. వైశాఖ అమావాస్య ప్రత్యేకమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. వైశాఖ మాసం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు.. ఈ అమావాస్య కేవలం ఒక చంద్ర దశ మాత్రమే కాదు.. ఇది విశ్వాసం, స్మరణ, నిశ్శబ్ద ఆచారాలతో ముడిపడి ఉన్న రోజు. సాధారణ అమావాస్యలతో పోలిస్తే వైశాఖ అమావాస్యకు ఎక్కువ పుణ్యఫలం లభిస్తుందని నమ్ముతారు. పితృదేవతలకు తర్పణాలు, నైవేద్యాలు సమర్పించడానికి ఈ రోజు అత్యంత అనుకూలమైనది. సత్తువ దానం చేయడం అత్యంత శుభప్రదంగా భావిస్తారు.. కాబట్టి దీనిని "సతువాయి అమావాస్య" అని కూడా పిలుస్తారు.

**వైశాఖ అమావాస్య 2026 తేదీ - సమయం:**

2026లో వైశాఖ అమావాస్య ఏప్రిల్ 16న రాత్రి 8:11 గంటలకు ప్రారంభమై ఏప్రిల్ 17న సాయంత్రం 5:21 గంటలకు ముగుస్తుంది. సూర్యోదయం ఆధారంగా లెక్కించే ఉదయ తిథి ప్రకారం, ఏప్రిల్ 17న అమావాస్యను పాటిస్తారు.

**వైశాఖ అమావాస్య నాడు చేయాల్సిన పనులు:**

పవిత్ర స్నానం: ఈ రోజున తెల్లవారుజామునే (బ్రాహ్మీ ముహూర్తంలో) నిద్రలేచి పవిత్ర నదులైన గంగ, గోదావరిలో స్నానం చేయడం అత్యంత ప్రయోజనకరం. అది సాధ్యం కాకపోతే, ఇంట్లోనే స్నానం చేసే నీటిలో కొన్ని చుక్కల గంగాజలం, నల్ల నువ్వులు కలుపుకుని స్నానం చేయవచ్చు. స్నానం చేసిన తర్వాత నువ్వులతో కలిపిన నీటిని సూర్య భగవానుడికి అర్ఘ్యంగా సమర్పించడం ఆచారంలో భాగం.

**ఉపవాసం:** చాలా మంది భక్తులు పండ్ల ఆధారిత ఉపవాసాన్ని పాటిస్తారు.

**పితృ తర్పణం:** అమావాస్య పితృదేవతలకు అత్యంత ప్రీతికరమైన రోజు. దర్భలు, నల్ల నువ్వులు, నీటితో పితృదేవతలకు తర్పణం వదలాలి. దీనివల్ల పితృ దోషాలు తొలగి, వంశాభివృద్ధి జరుగుతుందని నమ్మకం.

**దేవతారాధన:** ఇంటి పూజ గదిలో దీపం వెలిగించి మహావిష్ణువు లేదా శివుడిని ధ్యానించాలి. వైశాఖ మాసం విష్ణుమూర్తికి ప్రీతికరమైనది కాబట్టి 'ఓం నమో నారాయణాయ' మంత్రాన్ని వీలైనన్ని ఎక్కువ సార్లు జపించడం మంచిది. 'ఓం నమః శివాయ' మంత్రాన్ని కూడా జపించవచ్చు.

**దానధర్మాలు:** వైశాఖ అమావాస్య రోజున దానం చేయడం వల్ల అశ్వమేధ యాగం చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. వైశాఖ మాసం ఎండలు ఎక్కువగా ఉండే కాలం కాబట్టి, దాహంతో ఉన్నవారికి మంచి నీరు, మజ్జిగ, పెరుగు అన్నం, విసనకర్రలు, గొడుగులు, చెప్పులు దానం చేయడం విశేష పుణ్యాన్నిస్తుంది. అన్నదానం, పూర్వీకుల పేరు మీద వస్త్రదానం చేయడం కూడా మంచిది. రావి చెట్టు కింద దీపం వెలిగిస్తే ఆశీస్సులు లభిస్తాయని నమ్ముతారు.

**శని జయంతి విశేషాలు:** 2026లో వైశాఖ అమావాస్య రోజే శని జయంతి కూడా వస్తోంది. ఈ రోజున శని దేవునికి నువ్వుల నూనెతో అభిషేకం చేయడం లేదా గుడిలో నువ్వుల నూనె దీపం వెలిగించడం వల్ల శని దోష ప్రభావం తగ్గుతుంది. శని అష్టోత్తర శతనామావళిని పఠించడం, శని గాయత్రీ మంత్రం "ఓం ప్రాం ప్రీం ప్రౌం సః శనైశ్చరాయ నమః" లేదా "ఓం శం శనైశ్చరాయ నమః" 108 సార్లు జపించడం మంచిది. శని దోషం ఉన్నవారు హనుమంతుడిని పూజిస్తే శని ప్రభావం తగ్గుతుంది. కాబట్టి, హనుమాన్ చాలీసా పఠించడం చాలా ఉత్తమం. అవసరమైన వారికి నల్లని వస్త్రాలు, గొడుగులు, పాదరక్షలు దానం చేయడం, పారిశుధ్య కార్మికులకు లేదా పేదలకు భోజనం పెట్టడం శని దోష నివారణకు గొప్ప మార్గాలు. నల్లని కుక్కలకు లేదా కాకులకు నూనెతో చేసిన ఆహారం పెట్టడం కూడా శని ప్రభావాన్ని తగ్గిస్తుంది.

**పెద్దలను గౌరవించడం:** పెద్దలను, వృద్ధులను గౌరవించి వారి ఆశీస్సులు తీసుకోవాలి.

**వైశాఖ అమావాస్య నాడు చేయకూడని పనులు:**

**ఆహారం:** మాంసాహారం, ఉల్లిపాయ, వెల్లుల్లి వంటి తామసిక ఆహార పదార్థాలు, మినుములు లేదా వాటితో చేసిన వంటకాలు తినకూడదు.

**దురలవాట్లు:** మద్యం సేవించడం లేదా ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలి.

**కలహాలు:** ఇంట్లో లేదా బయట ఎవరితోనూ వాదోపవాదాలు, గొడవలు పడకూడదు. మనశ్శాంతిగా, ప్రశాంతంగా ఉండాలి.

**శుభ కార్యాలు:** సాధారణంగా అమావాస్య రోజున కొత్త పనులు ప్రారంభించడం, పెళ్లిళ్లు వంటి శుభకార్యాలు జరుపుకోరు. ఈ రోజు కేవలం జప, తప, దానాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలి. పెద్ద కొనుగోళ్లు చేయడానికి కూడా దూరంగా ఉండాలి.

**చెట్లు నరకడం:** చెట్లను నరకడం లేదా ఆకులను కోయడం వంటివి చేయకూడదు.

**నియమాలు:** ఈ రోజున బ్రహ్మచర్యం పాటించడం మంచిది. ఎవరినీ తక్కువ చేసి మాట్లాడకూడదు, ముఖ్యంగా కష్టపడి పనిచేసే కూలీలను, వృద్ధులను గౌరవించాలి.

మొత్తమ్మీద, వైశాఖ అమావాస్య అనేది ఆత్మపరిశీలన చేసుకోవడానికి, దానం చేయడానికి, సంప్రదాయాలతో సరళంగా, జాగరూకతతో కూడిన రీతిలో అనుసంధానమై ఉండటానికి ఒక పవిత్రమైన రోజు..

# ఆమె గొంతులో ఏదో మ్యాజిక్ ఉందబ్బా!

## సినీ వాయిస్ CINEMA — ఆశాజీ పాడిన ఎవర్ గ్రీన్ తెలుగు సాంగ్స్ ఇవే.. మీరు విన్నారా?



ఆశా భోంస్లే హిందీ, తెలుగు, కన్నడతో పాటు వివిధ భారతీయ భాషల్లో వేల సంఖ్యలో పాటలు ఆలపించారు. వీటిలో ఎక్కువగా హిందీ సాంగ్స్ ఉన్నప్పటికీ తెలుగులో ఆశా జీ పాడిన సాంగ్స్ ఎవర్ గ్రీన్ అని చెప్పుకోవచ్చు. మరి ఆ మధురమైన పాటలేంటో ఒక లుక్కేద్దాం రండి. దిగ్గజ గాయని ఆశా భోంస్లే (92) కన్నుమూశారు. ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం (ఏప్రిల్ 12) ఆమె తుది శ్వాస విడిచారు. పేరుకు హిందీ గాయని అయినా ఆమెకు అన్ని భాషల్లోనూ ప్రావీణ్యముంది.తెలుగులోనే కాకుండా హిందీ, తమిళం, బెంగాలీ వంటి 20కి పైగా భాషల్లో సుమారు 11,000కు పైగా పాటలు పాడి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారామె. కేవలం సినిమా పాటలే కాదు పాప్ మ్యూజిక్, గజల్స్, భజన పాటలతోపాటు భారత సాంప్రదాయ సంగీతం, జానపదాలు, ఖవ్వాలీ పాటలను పాడటంలోనూ ఆశాజీ సిద్ధహస్తురాలుసుమారు 8 దశాబ్దాల ఆమె సంగీత ప్రస్థానంలో తెలుగు సినిమాతో ఉన్న అనుబంధం చాలా తక్కువే అయినా, ఆమె పాడిన 8 పాటలు తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేశాయి. ఎవర్ గ్రీన్ క్లాసిక్స్‌గా నిలిచాయి. 1981లో 'పాలు నీళ్లు' అనే సినిమాలో 'ఇది మౌనగీతం' అనే పాటను ఆలపించారు ఆశాజీ. ఇది ఆమె పాడిన మొదటి తెలుగు సాంగ్. ఆ తర్వాత 1988లో 'చిన్ని కృష్ణుడు' చిత్రంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో కలిసి 'జీవితం సప్త సాగరం' అనే గీతాన్ని పాడారు. దీనికి ఆమె భర్త ఆర్డీ బర్మన్ సంగీతం సమకూర్చడం విశేషం. 1992లో బాలకృష్ణ హీరోగా నటించిన 'అశ్వమేథం' సినిమాలో ఆశా భోంస్లే రెండు పాటలు ఆలపించారు. ఇళయరాజా స్వరకల్పనలో ఆమె పాడిన 'ఓ ప్రేమా', 'సీతాకాలం ప్రేమకు' పాటలు ఎవర్ గ్రీన్ సాంగ్స్ అనిపించుకున్నాయి. ఈ సాంగ్స్ ఇప్పటికీ ఎక్కడో ఓ చోట వినిపిస్తూనే ఉంటాయి. ఇక 1995లో 'ప్రేమకు ప్రేమంటే తెలుసా' సినిమాలో 'జల్లంది మది' అనే పాట పాడారు ఆశా భోంస్లే. అలాగే 1996లో ఎంఎం కీరవాణి 'పవిత్ర బంధం' సినిమాలో 'ఐసాలకిడీ' అనే సాంగ్ ను ఆశాజీతో పాడించారు. వెంకటేష్, సౌందర్య హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో.. ఆశా భోంస్లేతో స్టేజ్ మీద ఈ సాంగ్ పాడించినట్లు చూపిస్తారు. ఇక మణిరత్నం'ఇద్దరు' సినిమాలో 'వెన్నెల వెన్నెల' పాటను ఎంతో అద్భుతంగా ఆలపించారు ఆశాజీ. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ స్వరాలు అందించారు. ఇక ఈ సాంగ్ తర్వాత చాలా ఏళ్లకు 2007లో కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'చందమామ' చిత్రంలో 'నాలో ఊహలకు' పాట పాడి తెలుగు సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు ఆశాజీ. ఈ సాంగ్ కు కెఎం రాధాకృష్ణన్ సంగీతం సమకూర్చారు. ఆశాజీ తెలుగులో పాడిన చివరి సాంగ్ ఇదే. మొత్తంగా తెలుగులో 8 పాటలు ఆలపించి ఇక్కడి ఆడియెన్స్ మనసులు గెల్చుకున్నారు ఆశా భోంస్లే.

# 'జననాయగన్' లీక్ వెనక ఆ ఇద్దరి కుట్ర..

## విజయ్ అభిమానుల సంచలన ఆరోపణలు



'జన నాయగన్' సినిమా మొత్తం హెచ్‌డి ఫార్మాట్‌లో లీక్ అయింది. ఇదిఆ సినిమా బృందానికి పెద్ద షాక్ ఇచ్చింది. తమిళ చిత్ర పరిశ్రమే కాకుండా, అనేక ఇతర రాష్ట్రాల చిత్ర పరిశ్రమ నాయకులు కూడా దీనిని ఖండించారు. అయితే జననాయగన్ సినిమా లీక్ వెనక ప్రధానంగా ఇద్దరి కుట్ర ఉందని విజయ్ అభిమానులు, విజయ్ టీవీకే రాజకీయ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి రిలీజ్ కావాల్సిన దళపతి విజయ్ 'జన నాయగన్' చిత్రానికి సెన్సార్ సమస్యలతో ఇప్పటివరకు ప్రేక్షకుల ముందుకు రాలేదు. ఈ సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. అయితే విజయ్ సినిమా రిలీజ్ చేయకుండా కొన్ని రాజకీయ శక్తులు అడ్డుపడుతున్నాయని స్వయంగా విజయ్ తన ఎన్నికల ప్రచారంలో ఆరోపించారు. విజయ్ అభిమానులు, టీవీకే పార్టీ శ్రేణులు కూడా జన నాయగన్ పై కుట్ర జరిగిందని ఎప్పటినుంచో ఆరోపిస్తున్నారు. విజయ్ రాజకీయ ప్రత్యర్థులు కుయుక్తితో తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి సినిమా విడుదలను ఆపారని అంటున్నారు. ఈ గందరగోళం మధ్య, 'జన నాయగన్' సినిమా మొత్తం అకస్మాత్తుగా ఎఱ ఫార్మాట్‌లో లీక్ అయింది. ఇది చిత్ర బృందానికి పెద్ద షాక్ ఇచ్చింది. కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్ సినీ ప్రముఖులందరూ దీనిని ఖండించారు. అయితే జన నాయగన్ సినిమా లీక్‌కు ఇద్దరు రాజకీయ నాయకులే కారణమని విజయ్ అభిమానులు, విజయ్ టివికె రాజకీయ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, తమిళనాడు బీజేపీ నాయకుడు ఎల్. మురుగన్, అలాగే తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీకి చెందిన యువ నాయకుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌లే 'జనయగన్' సినిమా లీక్ వెనుక ఉన్నారని విజయ్ అభిమానులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. 'మొదట 'జన నాయగన్' సినిమా ప్రజలకు చేరకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు విజయ్ సినిమాను ఆర్థికంగా దెబ్బతీశారు. కేంద్ర మంత్రి ఎల్. మురుగన్, ఉదయనిధి స్టాలిన్‌లు కలిసి విజయ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ కుట్రకు పాల్పడ్డారు' అని టీవీకే పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడు అధవ అర్జున ఆరోపించారు. విజయ్ అభిమానులు కూడా సోషల్ మీడియాలో ఇలాంటి ఆరోపణలే చేస్తున్నారు. విజయ్ అభిమానుల ఆరోపణలు, టీవీకే నాయకుల ఆరోపణల తమిళనాడు బీజేపీ నాయకుడు అన్నామలై స్పందించారు. 'జన నాయగన్' సినిమా లీక్ అవ్వడం అన్యాయం, చట్టవిరుద్ధం. కానీ ఆ చర్యను మంత్రి ఎల్. మురుగన్‌కు ముడిపెట్టే ప్రయత్నం మాత్రం రాజకీయ ప్రేరేపితం. 'దీనిలోకి బీజేపీని ఎందుకు లాగాలి? సినిమా విడుదల లేదా లీక్‌లో బీజేపీ పార్టీకి ఎలాంటి పాత్ర లేదు. ఈ లీక్‌పై దర్యాప్తు చేసి, బాధ్యులపై చర్య తీసుకోవడం పోలీసుల బాధ్యత. సరైన దర్యాప్తు ద్వారా ఈ చర్య వెనుక ఉన్న వ్యక్తులను వెలుగులోకి తీసుకురావాలి. కేవలం బీజేపీని దీనిలోకి లాగి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నించవద్దు' అని టీవీకే శ్రేణులకు కౌంటర్ ఇచ్చారు అన్నామలై.

# తెలుగింటి కోడలిగా మృణాళ్ ఠాకూర్!

## అల్లు అరవింద్ మాటలకు హీరోయిన్ రియాక్షన్ చూశారా?



గతంలో ఓ సినిమా ఫంక్షన్లలో లావణ్య త్రిపాఠిని మెచ్చుకుంటూ ఈ అమ్మాయి తెలుగింటి కోడలైతే బాగుండు అని సరదాగా అన్నారు. మరి ఆయన మాటలు తథాస్తు దేవతలు విన్నారేమో లావణ్యను ఏకంగా మెగా ఫ్యామిలీకి కోడలిగా పంపించారు. ఇప్పుడు కూడా మృణాళ్ విషయంలో అదే జరగనుందా? అడివి శేష్, మృణాళ్ ఠాకూర్ జంటగా నటించిన లేటెస్ట్ సినిమా డెకాయిట్. ఏప్రిల్ 10న విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. ఈ సినిమా కేవలం రెండు రోజుల్లోనే రూ. 28 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో డెకాయిట్ చిత్ర బృందం ఆదివారం (ఏప్రిల్ 12) సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. కాగా గతంలో ఓ సినిమా ఫంక్షన్ లో లావణ్య త్రిపాఠిని మెచ్చుకుంటూ నువ్వు తెలుగింటి కోడలివైతే బాగుండు అని సరదాగా అన్నారు. మరి ఆయన తెలిసి అన్నారో తెలియక అన్నాడో ఏమో కానీ లావణ్య మెగా ఫ్యామిలీకి కోడలైపోయింది. ఇప్పుడు ఇదే సంఘటనను గుర్తు చేస్తూ మృణాళ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు అల్లు అరవింద్. 'మృణాల్.. నీకు ఒక మాట చెప్పాలి. నువ్వు చాలా అద్భుతంగా నటిస్తున్నావు. నువ్వు మాకు కావాలి. నీ గ్లామర్, నీ యాక్టింగ్ తెలుగు ప్రేక్షకులకు బాగా నచ్చేశాయి. 'గతంలో ఓ అమ్మాయిని (లావణ్య త్రిపాఠీ)ని ఇలాగే దీవించాను. ఆమె వరుణ్ ను పెళ్లి చేసుకొని ఇక్కడే ఉండిపోయింది. అందుకే నీకు నా తరఫున ఒక చిన్న సలహా.. నువ్వు ఎలాగైనా ఒక తెలుగు అబ్బాయిని చూసుకుని పెళ్లి చేసేసుకో. అప్పుడు నువ్వు ఇక్కడే సెటిలైపోవచ్చు.. మా టాలీవుడ్ హీరోయిన్‌గా శాశ్వతంగా ఉండిపోవచ్చు' అని నవ్వుతూ అన్నారు. అల్లు అరవింద్ మాటలకు మృణాళ్ సిగ్గుపడిపోయింది. ముఖమంతా ఎర్రబడిపోయి ముసిముసిగా నవ్వేసింది. స్టేజ్ మీదున్న మిగతా సెలబ్రిటీలు కూడా అరవింద్ మాటలకు నవ్వుల్లో మునిగిపోయారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. "అరవింద్ కరెక్ట్‌గా చెప్పారు.. మృణాల్ మా తెలుగు కోడలు కావాల్సిందే! ' మరి మృణాళ్ కు కాబోయే జోడీ ఎవరు' అంటూ అప్పుడే మ్యాచెస్ చూడడం స్టార్ట్ చేశారు నెటిజన్లు.

## క్రీడా వాయిస్ — ఉత్కంఠ పోరులో ఓడిన ముంబై..


# 3వ స్థానానికి చేరిన బెంగళూరు



ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో 18 పరుగుల తేడాతో ఓడిపోవడంతో, ముంబై ఇండియన్స్ ఈ ఐపీఎల్ సీజన్‌లో వరుసగా మూడో ఓటమిని చవిచూసింది. తమ సొంత మైదానమైన వాంఖడేలో 240 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, ముంబై 20 ఓవర్లలో కేవలం 222 పరుగులు మాత్రమే చేయగలిగింది. సుయాష్ శర్మ ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. 241 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న ముంబై జట్టుకు రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ జోడి బలమైన ఆరంభాన్ని అందించారు. ఈ ద్వయం 32 బంతుల్లో 57 పరుగుల అజేయ ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అయితే, రోహిత్ శర్మ గాయంతో రిటైర్ అయిన తర్వాత, సూర్యకుమార్ యాదవ్ 33, తిలక్ వర్మ 1, హార్దిక్ పాండ్యా 40 పరుగులు చేశారు. చివరగా, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 31 బంతుల్లో 9 సిక్సర్ల సహాయంతో 71 పరుగులతో అజేయంగా నిలిచినా, జట్టును విజయపథంలో నడిపించలేకపోయాడు.

# ముంబై గడ్డపై కోహ్లీ విశ్వరూపం..

## ఐపీఎల్ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిన రన్ మెషిన్!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన బ్యాటింగ్‌తో ప్రపంచాన్ని మంత్రముగ్ధులను చేశాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన హైవోల్టేజ్ పోరులో కోహ్లీ అరుదైన మైలురాయిని చేరుకుని, టీ20 క్రికెట్ చరిత్రలోనే ముంబైపై అత్యధిక పరుగులు చేసిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. వాంఖడే స్టేడియంలో కోహ్లీ విధ్వంసానికి రికార్డులన్నీ కనుమరుగయ్యాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌ను కనబరిచాడు. ఐదుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్‌పై టీ20ల్లో 1000 పరుగులు పూర్తి చేసిన మొదటి బ్యాటర్‌గా కోహ్లీ చరిత్రకెక్కాడు. ఇప్పటివరకు ఈ రికార్డు కేఎల్ రాహుల్ (977 పరుగులు) పేరిట ఉండగా, తాజా ఇన్నింగ్స్‌తో కోహ్లీ అతడిని అధిగమించాడు. శిఖర్ ధావన్ 901 పరుగులతో ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

### 37 ఏళ్ల వయసులోనూ అదే జోరు..

వయసు పెరుగుతున్నా కోహ్లీలోని పట్టుదల, పరుగుల దాహం ఏమాత్రం తగ్గలేదని ఈ మ్యాచ్ నిరూపించింది. రోహిత్ శర్మ సొంత గడ్డపై, ముంబై అభిమానుల ముందే కోహ్లీ ఈ ఘనత సాధించడం విశేషం. కేవలం ముంబైపైనే కాకుండా, చెన్నై సూపర్ కింగ్స్‌పై కూడా కోహ్లీకి అద్భుతమైన రికార్డు ఉంది. చెన్నైపై ఆయన ఏకంగా 1,174 పరుగులు సాధించాడు. ఇది ఒక ఐపీఎల్ జట్టుపై ఒకే ఆటగాడు చేసిన అత్యధిక పరుగులు.

### వాంఖడేలో పరుగుల సునామీ..

టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్య బెంగళూరును బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన కోహ్లీ, తన భాగస్వామి ఫిలిప్ సాల్ట్‌తో కలిసి ముంబై బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. వీరిద్దరి ధాటికి బెంగళూరు జట్టు కేవలం 4.2 ఓవర్లలోనే 50 పరుగుల మార్కును దాటింది. ఇది ముంబైపై బెంగళూరుకు మూడో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ. పవర్ ప్లే ముగిసే సమయానికి బెంగళూరు వికెట్ నష్టపోకుండా 71 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది.

### బద్దలైన రికార్డులు.. భారీ భాగస్వామ్యం..

ఈ మ్యాచ్‌లో కోహ్లీ, ఫిలిప్ సాల్ట్ కలిసి మొదటి వికెట్‌కు 120 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముంబై ఇండియన్స్‌పై బెంగళూరు తరపున ఇది రెండో అత్యుత్తమ ఓపెనింగ్ భాగస్వామ్యం. ఫిలిప్ సాల్ట్ 35 బంతుల్లో 6 సిక్సర్లతో 78 పరుగులు చేయగా, కోహ్లీ 25 బంతుల్లో 35 పరుగులు చేసి తన వంతు సహకారాన్ని అందించాడు. శార్దూల్ ఠాకూర్ ఈ జోడీని విడదీసినప్పటికీ, అప్పటికే బెంగళూరు భారీ స్కోరుకు గట్టి పునాది వేసింది. ప్రస్తుతం కోహ్లీ ఫామ్ చూస్తుంటే ఈ సీజన్‌లో మరిన్ని రికార్డులు బద్దలవడం ఖాయంగా కనిపిస్తోంది. రన్ మెషిన్ కోహ్లీ తన బ్యాట్‌తో సమాధానం చెబుతూ, విమర్శకుల నోళ్లు మూయించాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

Published and Edited by Khandavelli Sunilkumar on behalf of Viswam Voice. Published from H.No. 8, 3-430/1/20, Near BSNL Office, Ameerpet, Ali Nagar, Yella Reddy Guda, Hyderabad, Telangana - 500016. Printed at Sri Sai Ganga Printers and Publications, D.No. 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District, Andhra Pradesh - 523001.Registration No: TGTEL/26/A1458